

# దేవుడికో చిన్న లేఖ

శ్రీ ఎస్. ఆర్. చందూరి

కపట నాటక సూత్రధారికి వెయ్యి నమస్కార బాణాలు పెడ్తూ, సందేహపూర్వకంగా వ్రాసుకొనే దేమిటంటే:

ఓ మిథ్యా ప్రపంచకాధీశ్వరా, నువ్వు అబద్ధమా, నిజమా? ఇదంతా అబద్ధపు ప్రపంచకమైతే, అంతా బూటకమైతే, మాకు న్యాయం ఎక్కడవుంది? 'దైవ యత్నం లేనిదే ఏపనీ, సాగదు.' అని అంటారు పెద్దలు! అవుతే, రోజూ మాచేత చేయించే పనులన్నీ నీప్రయత్నమేకదా! నువ్వు తలుచుకోందేమేమే పని చెయ్యలేమన్నమాట రూఢి అవునంటావా, కాదంటావా, సంగతి సందర్భాలలావుంటే మేం చేసే పనులన్నీ నువ్వే చేస్తున్నట్లు అర్థమవుతోందే!! శతకోటి మార్తాండ తేజా, అన్ని పనులూ నువ్వే చేస్తూ, పైగా, మాలో కొందర్ని పుణ్యాత్ములనీ, మరి కొందర్ని పాపులనీ అనడం నీకేం న్యాయమని అడుగుతా.

మొన్న సాయంకాలం బెజవాడ ఆనకట్టదగ్గర వో శాస్త్రిగారితో అంటున్నాడు వో నవనాగరికుడు ......ఏమనా? "ఏం పురాణాలండీ చెవులు చిల్లులు పడుతున్నాయి వినలేక 'నలుగురు మొగుళ్ళతో పోయిన నువ్వు నన్ను కోడంటికం పెడ్తావా' అని ఆక్షేపిస్తుందేమో అని కదా అయిదుగురు మొగుళ్ళని అంటగట్టింది కుంతి తన కోడలకి!" అని అంటే ఆపురాణాల శాస్త్రుల్లుగారు గుడ్లు తేలేసి, "ఛీ. మాలవెధవల సంపర్కంవల్ల పవిత్రభూమి కెంతగతి పట్టింది" అని అంటాడు. కాని పై ఆక్షేపణని సమర్థించలేకపోయాడే! భగవంతుడా, యిలాటి semi-cracks ఎందుకయ్యా నియమించావు, మాకు పురాణాలు చెప్పేందుకు, శాస్త్రాలు బోధించేందుకు?

"దేవతలే సురాపానం తాగుతారని పురాణాల్లో వుంది కదా, మానవ మాత్రులమైన మనం refreshment room కి వెళ్తే తప్పా?" అని ప్రశ్నించే మాపక్కింటి ప్లీడరుగారి ప్రశ్నకి నువ్వేం సమాధానం చెప్తావ్?

లీలామానుష విగ్రహా! తప్పులన్నీ చెయ్యమని మాతో చెప్తూ మాచేత నువ్వుచేయిస్తూ, పైగా మమ్మల్నెందుకయ్యా దండిస్తా నంటావుట?

పూర్వం యుద్ధంలో చచ్చిపోయిన వాళ్ళకి వీరస్వర్గం యిస్తావుండే వాడివిట. ఈ కాలంలో వోట్ల దెబ్బలాటల్లో హతులైనవాళ్ళకి కూడా అలాటి దేమన్నా arrange చెయ్యమని చిత్రగుప్తుడితో చెప్పావా?

మహానుభావా! బ్రహ్మశ్రీ గిరీశంగారి గురించి నీ ఉద్దేశం ఏమిటి? ఓమూలపురుషా! కారణం లేకుండా ఏమీ వుండదని అంటారుగదా, నీ పుట్టుకకి కారణ

మేమిటి? ఆదిమధ్యాంతరహితా! నీ 'డ్యూటీ' కేప్ కామరిన్ నుంచి ఎవరెస్ట్ శిఖరం వరకు మాత్రం వుందా, లేక ఈ మిథ్యా ప్రపంచకంలో వుండే ప్రతి పరమాణువులోనూ వున్నావా?

మోహినీ అవతారమెత్తిన గోపికా మానసాపహారా! నువ్వు లక్ష్మీదేవిని మునుపటికి మల్లే "లచ్చీ" అని పిలుస్తున్నావా, (నాతో ఆ మధ్య భూలోకసంచారి అయిన నారదుడు మూడోక్లాస్ రైల్వే పెట్టెలో ప్రయాణంచేస్తూ, 'పాస్' నీదగ్గర మర్చిపోయి రావడంచేత కాబోలు ప్రయాణీకులు కూచునే బల్లకింద పడుకుని, మాటల ధోరణీలో అన్నాడులే!) లేక, నవనాగరీకంగా "లక్ష్మీబాయిగారూ, అని పిలుస్తున్నవా స్త్రీల హక్కులు ... ... జాగ్రత సుమా!!

ఈశ్వరా! ఏదో తప్పులెన్నానని కోప్పడకు సుమా నాకు తెలీదనుకున్నావే మిటయ్యా, మహానుభావా, నీప్రతిభ? పాఠకుల్ని నవ్వించేందుకు వ్రాసానుగాని, అండపిండ వేదాండ బ్రహ్మాండాన్నంతా ఆడించే శక్తిగల నీలాంటి కపటనాటక సూత్రధారితో, కాకపోతే మరెంకెవరితో వుందయ్యా ఈ మిథ్యాప్రపంచకం? అవసరాన్ని బట్టి అల్లుడి తప్పులు అత్త దిద్దుకొన్నట్లు మన్నించాలి సుమా, మహానుభావుడివి. కొంపతీసి, కోపం మనస్సులో వుంచుకొని, పెళ్ళానికి కావలసిన బ్రూచెస్, సిల్కు చీరెలూ తెచ్చియివ్వలేని ఈ కరువు రోజుల్లో, మా మేనేజరు మనస్సులో దూరి, వున్న ఉద్యోగం మాత్రం వూడపీకించకు సుమా!


పరమాత్మా! అడగడం మర్చిపోయాను. నువ్వుండే పాలకడలిలో ఏ జడలయ్యరు కాఫీ హోటల్ లేకపోతే నీకు రోజూ కాఫీ ఎలావస్తోందయ్యా, ఈశ్వరా? మరి సెలవా?


# త్రేళ్ళ పాలిట యముడు?

ఔను

ఒకే ఒక ప్రయోగము—

దానితో బాధ మాయము కావలసినదే.




## తేలు మందు
(రిజిష్టర్ ట్రేడ్ మార్కు)

మందు పడినతోడనే విషము పారిపోవును!

ఏడ్పుతో వచ్చువారు నవ్వుతూ పోవలయును!

మనదేశములో ఈమందు ప్రతి యింటిలోను ముఖ్యముగా ఉండి తీరవలయును. ఇది ఆంగ్ల, యూనాని, ద్రవిడ, ఆంధ్ర వయిద్య నిపుణులవలన మెప్పుదల పొంది యున్నది. యెన్నిదినములు నిలువయుంచినను ఈ మందుయొక్క గుణము మారదు. తేలు, మండ్రగప్ప, జర్రి, పాము, ఎలుక, ఇంకను యితర విషజంతువుల విషములను రెండు నిముషములలో పరిశుద్ధముగా నివారణ కలుగ జేయును.

ప్యాకెట్టు 1-కి 0–8–0. తపాలాఖర్చు 0–5–0.

ఒకేసారి 8 ప్యాకెట్లు కొనువారికి
తపాలాఖర్చుతో సహా 1–8–0

12 ప్యాకెట్లు కొనువారికి
తపాలాఖర్చుతో సహా 5–0–0

ధనలక్ష్మి అండు కో,

నెం. 6 లాయరు చిన్నతంబిమొదలి వీధి,

సౌకారుపేట, మదరాసు.